

బి.వి. జగన్మోహన్రావ్

# లక్ష్మణరావుకి లాటరీ వచ్చింది

పిచ్చి అనేక రకాలు. ఏ పిచ్చీ లేకపోవడం కూడా ఓ పిచ్చే అని ఎవరో అన్నారు.

లక్ష్మణరావుకి వున్నదల్లా ఒకే ఒక పిచ్చి.

లాటరీల పిచ్చి.

అయితే దాన్ని 'పిచ్చి' అంటే ఏ మాత్రం ఒప్పుకోడు. అదీ ఓ దేశసేవే అంటాడు పైకి. కానీ లోపల మాత్రం లాటరీల పట్ల తనకెంత ఆశ వుందో అతనికే తెలుసు. మరి! విషయాని కొద్దాం.

ఇప్పటికి ఆ ప్రకటనని రేడియోలో నాలుగుసార్లు విన్నాడు. ఈ రోజు పేపర్లో హాఫ్ పేజ్ అడ్వర్టయిజ్‌మెంట్ కూడా చూశాడు.

ఇక ఆగలేకపోయాడు. ఇలాంటివన్నీ నెలాఖర్లోనే రావాలా అని విసుక్కున్నాడు.

మొదటి బహుమతి 5 కోట్లు.

ఒక్కసారి అనుకోగానే లక్ష్మణరావులో ఎన్నెన్నో ఆశలు హిమాలయాలంత ఎత్తుకు ఎదిగిపోతున్నాయి.


ఆ లాటరీలో కనీసం ఏ తర్డ్ ప్రైజో, ఫోర్త్ ప్రైజో వచ్చినా చాలు. తన కలలన్నీ నిజాలయిపోతాయి.

పట్టువదలని విక్రమార్కుడిలా ఈ లాటరీ టిక్కెట్లను అతను కాలేజీలో చదివే రోజుల్నుంచే కొనడం ప్రారంభించాడు. ఇప్పుడు ఇద్దరు పిల్లలకు తండ్రయ్యాడు. రోజు రోజుకీ అతన్లో వీటిపట్ల ఆసక్తి పెరుగుతోందే తప్ప అణుమాత్రమయినా తగ్గడం లేదు.

నెలకి ఎలా లేదన్నా అరవయి, డెభ్భై రూపాయలు ఈ లాటరీలకే ఖర్చు పెడతాడు. గత పది సంవత్సరాలుగా లక్ష్మణరావు కొన్న లాటరీ టిక్కెట్ల ఖరీదు జమచేస్తే అయిదారు వేల రూపాయల వరకూ అవుతాయి.

కానీ ఇన్నేసి కొంటున్నా కనీసం ఆఖరి ప్రైజు అయిదో పదో కూడా రాకపోవడం అతనికి మరీ బాధ కలిగించినా తనలో పట్టుదల మాత్రం సడల్లేదు. అయితే ఒకసారి ఒకే ఒక అంకె తేడాలో లక్ష రూపాయల బహుమతి తప్పిపోయింది.

అప్పట్నించే తనకి ఖచ్చితంగా లాటరీ అదృష్టం వున్నదనే నమ్మకం లక్ష్మణరావులో బాగా కలిగింది. అందుకే దేశంలో ఎన్నిరకాల లాటరీలున్నాయో అన్నిటినీ కొనడం మొదలెట్టాడు.




సమయానికి తన దగ్గర డబ్బు లేకపోయినా అప్పు చేసయినా అయిదారు టిక్కెట్లు కొనేయడం అతనికి 'లాటరీ'తో పెట్టిన విద్య.

లక్ష్మణరావు లాటరీ పిచ్చి చూసి అతని భార్య సుమతి వీలుదొరికినప్పుడల్లా — ఒరే రవీ! ఈసారి మీ నాన్నగార్కి లాటరీలో ఫస్టు ప్రైజొస్తుందిలే, దాంతో పేద్ద బంగళా, కారు, కలర్ టీవీ కొంటారు. నీకు ఇంకా ఏం కావాలో చెప్పరా?" అని ఎగతాళిగా నవ్వడం సుమతికి అలవాటయితే దాన్ని అస్సలు పట్టించుకోక పోవడం లక్ష్మణరావులోని గొప్పతనం.

ఎప్పటికయినా తనకి లాటరీ తగులుతుంది. ఈ వెధవ గుమాస్తా ఉద్యోగానికి గుడ్‌బై చెప్పేసి హాయిగా కాలు మీద కాలేసుకుని జల్సాగా బ్రతకొచ్చు. ఇదే అతని మనసులో నిత్యం కలిగేది.

ఈ మధ్య కాలంలో జనాభా ఎంత వేగంగా పెరుగుతోందో అంతకన్నా ఎక్కువ వేగంగానే రకరకాల లాటరీలు పుడుతున్నాయి. అన్నీ కొనకపోయినా తొంభై శాతం వరకూ అటెంప్ట్ చేస్తున్నాడు.

పేపర్లో ఆ ప్రకటన చూడగానే ఒకటే ఆలోచన. ఇంకా అయిదు రోజుల్లోనే 'డ్రా' — సమయానికి డబ్బుల్లేవు. ఒకో టిక్కెట్టూ ఇరవై రూపాయలు. ఓ మూడు నాలుగు టిక్కెట్లయినా కొనాలి అతని పాలసీ ప్రకారం.

సుమతిని అడిగి చూస్తే, తనకి తెలీకుండా ఆ మాత్రం పొదుపు చేయకుండా వుండదా ఏమిటి అనుకుని వంటింట్లోకి వెళ్లాడు.

"సుమతి! నీ దగ్గర ఏమయినా డబ్బులున్నాయా? ఓ యాభయ్యో, అరవయ్యో" మెల్లగా అడిగాడు.

కూర తరుగుతున్నదల్లా ఒక్కసారి తలెత్తి చూసింది సుమతి.

"ఆ మీరు కట్టలు కట్టలు తెచ్చి నా చేతిలో పోస్తున్నారు కదా. బీరువాలోంచి తీసిస్తానుండండి" అంది వస్తున్న నవ్వును ఆపుకుంటూ వీలయినంత హేళనగా.

"అబ్బ! అవకాశం దొరికితే చాలు. లేదని తిన్నగా చెప్పొచ్చు కదా! డొంక తిరుగుడు మాటలెందుకు" అని కోపంగా తిరిగొచ్చేశాడు లక్ష్మణరావు.

ఎలా ఇప్పుడు?

ఆఫీసులో ఎవరి దగ్గరైనా ప్రయత్నించి చూడాలి అనుకున్నాడు.

ఏదో భోజనం అయిందనిపించి హడావిడిగా ఆఫీసుకి బయల్దేరాడు.

ఏ కళనున్నాడో ఎవరికీ నయాపైసా అప్పుగానీ, ఖర్చుగానీ పెట్టని భజగోవిందం లక్ష్మణరావుకి వంద రూపాయలు అప్పుగా నవ్వుతూ ఇచ్చాడు. అతనికి బోల్డు థాంక్స్ చెప్పేశాడు లక్ష్మణరావు తనకి ఏదో గొప్ప మంచి జరిగినట్టు.

ఉదయం ఆఫీసుకి బయలుదేరుతున్నప్పుడు కుడికన్ను అదిరింది. ఎవరికీ అప్పు ఇవ్వని భజగోవిందం తనకి ఇచ్చాడు. అంటే! ఇక అనుమానపడాల్సిన అవసరం లేదు.

ఖచ్చితంగా ఈసారి తనకి లాటరీ తగిలి తీరుతుంది. ఈ దెబ్బతో తనో లక్షాధికారి అయిపోతాడు.

సాయంత్రం ఇంటికెళ్తూ దార్లో 'కష్టాల లక్ష్మి" సూపర్ ట్రిబుల్ బంపర్ లాటరీ టిక్కెట్లు అయిదు కొనేశాడు వందరూపాయలకి.

ఆనందంగా వాటిని చూసుకుని హుషారుగా ఇంట్రోవసట్టాడు.

* * *

ఆ రోజే ఫలితాలు ప్రకటిస్తారు.

తెల్లవారు జామున నాలుగ్గంటలకే లేచిపోయాడు లక్ష్మణరావు. పేపర్ ఎప్పుడొస్తుందా రిజల్ట్స్ ఎప్పుడుచూస్తానా అని యమా కంగారుగా ఎదురుచూస్తున్నాడు.

ఆరుగంటలకి పేపరొచ్చింది.

ఎంతో ఆత్రుతతో రిజల్ట్స్ కోసం వెతికాడు. ఎక్కడా కనబడలేదు. కొంపతీసి ఈ పేపర్‌కి ఆ అడ్వర్టయిజ్‌మెంట్ ఇవ్వలేదేమో అని ఆలోచిస్తుండగానే చిన్న ప్రకటన లక్ష్మణరావు దృష్టిలో పడింది.

"కొన్ని అనివార్య కారణాలవల్ల 'కష్టాల లక్ష్మి' సూపర్ ట్రిబుల్ బంపర్ లాటరీ 'డ్రా' జరగలేదని తెలియజేయడానికి విచారిస్తున్నాం. వచ్చేనెల పదిహేనో తేదీన ఈ 'డ్రా' తీయబడుతుంది"

'ఛ'.

పంక్చరయిన టయిర్లా అయిపోయాడు లక్ష్మణరావు. తన ఇన్నాళ్ల లాటరీ చరిత్రలో ఇలా ఎప్పుడూ జరగడం అతనికి తెలీదు. బహుశా అదృష్టం కలిసొచ్చి ఆ లాటరీ తనకే వ

స్తుంది కాబోలు ఇలా సస్పెన్సు పెంచుతోంది అనుకుని ఆనందం పట్టలేకపోయాడు. ఆ ఆనందంలో చేతిలోని పేపర్‌ని నలిపేసి ముక్కలు ముక్కలు చేసేశాడు.

ఈ మధ్య చుట్టాలు లక్ష్మణరావు ఇంటిపైకి వరసగా దాడిచేశారు. ఆఫీసులో ఆడిటింగ్ గొడవలతో క్షణం తీరిక లేకుండా అయిపోయాడు లక్ష్మణరావు. అందువల్ల ఎప్పుడూ జరగని విధంగా ఈ నెల రోజులూ లాటరీలకు కొంచెం దూరమయాడనే చెప్పాలి.

ఆరోజెందుకో ఆఫీసర్‌తో బాగా చీవాట్లు తినాల్సివచ్చింది. దాంతో డబల్ నీరసంతో ఇంటికి వచ్చాడు.

రాగానే అతని కోసమే ఎదురు చూస్తున్న సుమతి ''ఏవండోయ్! ఈ రోజు పేపర్ చూళ్లేదా మీరు? చాలా గొప్ప గుడ్ న్యూస్'' అంది హుషారుగా.

''ఏవిటది?'' విసుగ్గా కుర్చీలో కూర్చుంటూ అడిగాడు లక్ష్మణరావు.

''మీకు లాటరీ తగిలిందండి'' నవ్వుతూ చెప్పింది సుమతి.

''వ్వాట్''? అలాగే శిలా ప్రతిమలా రెండు క్షణాలుండిపోయాడు.

గ్లాసుడు నీళ్లు తాగాక ''నువ్వు చెప్పేది నిజమేనా సుమతి చూశావా నన్నందరూ ఎగతాళి చేసేవారు. ఇప్పుడు చూడు ఈ దెబ్బతో మనం లక్షాధి.. ఏదీ పేపరూ, టిక్కెట్లు నన్ను చూడనీ'' అంటూ పేపర్ని తీసుకున్నాడు.

ఫలితాలు జాగ్రత్తగా చూస్తున్న లక్ష్మణరావు ముఖంలో రంగులు మారడం సుమతి గమనించింది. రిజల్ట్స్ మొత్తం చివరి వరకూ చూసిన అతనికి అప్పుడు తెలిసింది సుమతి ఎందుకు నవ్వుతోందో.

వందరూపాయలు పెట్టి కొన్న లాటరీ టిక్కెట్లలో ఒకదానికి చిట్టచివరి ముప్పయి రూపాయల బహుమతి వచ్చింది.

అప్పుడే అక్కడి కొచ్చిన లక్ష్మణరావు రెండో కొడుకు ఆరేళ్ల నానిగాడు ''నాన్నా! నీకు లాట్రీ వచ్చిందటగా అమ్మ చెప్పింది మరి టీవీ కొనవా? ఎంచక్కా క్రికెట్ మాచ్ చూడొచ్చు'' అంటూ ముద్దు ముద్దుగా అడిగాడు.

తనవేపే అదోలా చూస్తున్న సుమతి కనిపించగానే లక్ష్మణరావులో ఎక్కలేని కోపమూ వచ్చేసింది. చేతిలో టిక్కెట్లని పరపరా చించేశాడు.

అతన్నలా చూసిన సుమతికి నవ్వాగలేదు. *


వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి

తెల్లమచ్చలకు చికిత్స




తెల్లమచ్చలు నయంకాని వేమీ కాదు. సకాలంలో సరైన చికిత్స చేస్తే మిగిలిన జబ్బులలాగే ఇది కూడ నయంచేయొచ్చు. మా నిరంతర పరిశోధనల ఫలితంగా తెల్లమచ్చ (బొల్లి)ను నయం చేయటంలో మేము విజయం సాధించాం. ఈ మందు ఎంత శక్తివంతమైందంటే ఎంత వేగంగా తగ్గిస్తుందంటే—ఉపయోగించిన వెంటనే చర్మం రంగు మారటం ప్రారంభిస్తుంది, కుదుళ్ళను నాశనం చేస్తుంది. మరియు చర్మం యొక్క సహజరంగును త్వరగా పునరుద్ధరిస్తుంది. ఇతర వైద్యులతో మీరు విసిగిపోయివుంటే మా మందును ఒక్కసారి వాడినంతనే మీకు తృప్తి కలుగుతుంది. మీ జబ్బును గురించిన పూర్తి వివరాలు వ్రాసి మా ఉచిత సలహాను అడగండి:-

ఈ వైద్యం కోసం మందును ఎవరైనా చేయవచ్చును.
విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి.

**SRI AYURVEDIC PHARMACY (A B )**
**P.O. KATRI SARAI (GAYA)**

అందరినోటా ఒకేమాట

అతిరుచికరమైన ఇండియన్ చైనీస్. కాంటినెంటల్ భోజన పదార్థములకు

**VISIT ONCE AND TASTE FOR YOUR SELF**

# సారథి

గార్డెన్ బార్ & రెస్టారెంట్ A.C.
కాళేశ్వరరావురోడ్, విజయవాడ-2

**FOR HOME DELIVERY DIAL- 62387**

A CLASS BY IT SELF

devaz..